రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

క్యూలో దర్శనం కోసం నిలబడ్డ భక్తులు

వేములవాడ టౌన్, మార్చి 25 : వేములవాడ రాజన్న క్షేత్రానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. రద్దీ దృష్ట్యా అధికారులు ఆలయ గర్భగుడిలో ఆర్జిత సేవలను రద్దు చేశారు. భక్తులు స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో ఎంతో భక్తిశ్రద్ధలతో తలనీలాలను సమర్పించుకున్నారు. గంటల తరబడి నిలబడి రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఆలయంలో భక్తు లు శీఘ్ర, ధర్మ దర్శనం జిగ్‌జాగ్ క్యూల మీదుగా ఆలయం లోనికి ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు. కళాభవన్‌లో దంపతులు కల్యాణ మొక్కులు తీర్చుకున్నారు. రాజన్నను దాదాపు 10 వేలకు పైగా భక్తు లు దర్శించుకున్నారని, రాజన్నకు సుమారు రూ.14 లక్షలకు పైగా ఆదాయం సమకూరిన ట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

చివరి రోజు కనులపండువగా డోలోత్సవం

అద్దాల మండపంలో డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ టౌన్, మార్చి 25 : మూడు రోజుల పాటు రాజన్న ఆలయంలో నిర్వహించిన త్రిరాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి డోలోత్సవ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అద్దాల మండపంలో వేదపండితులైన బ్రాహ్మణులు ఆలయ పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారిని, లక్ష్మీసమేత అనంత పద్మనాభ స్వామి వారిని పల్లకీలో కూర్చుండబెట్టి డోలోత్సవం నిర్వహించారు. ఆగమ శాస్త్రం ప్రకారం రాజన్న ఆలయంలో ఈ డోలోత్సవం కార్యక్రమాన్ని పున్నమికి ముందు నుంచి నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, మా క్లయింట్ కైలాసకోటి మహేష్ తండ్రి రాజన్న, వయస్సు 31, వృత్తి అగ్రికల్చర్, ఇంటి నెం. 1-2-53, మల్యాల గ్రామం మరియు మండలం, జగిత్యాల జిల్లా గారు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించుచూ, ఏజెంట్ పన్యాల రాజమౌళి తండ్రి కోటయ్య, వయసు 55, వృత్తి వ్యాపారం, ఇంటి నెం. 9-1-126/1, రాజీవ్ నగర్, వేములవాడ గ్రామం మరియు మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి చేసిన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కోనారావుపేట్ గ్రామ శివారులోగల భూమిని, తేది: 23-01-2020 రోజున జనరల్ పవర్ ఆఫ్ అటర్ని రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నంబర్ 474/2020, ద్వారా (జిపిఏ) జనరల్ పవర్ ఆఫ్ ఆటర్ని రిజిస్టర్డ్ డాక్యుమెంటును రద్దు (క్యాన్సల్) చేయుటకు గాను ఏజెంట్ ఐన పన్యాల రాజమౌళి గారికి తేది: 19-03-2024 రోజున రిజిస్టర్ పోస్ట్ ద్వారా లీగల్ నోటీస్‌ను ప్రిన్సిపాల్ కైలాస కోటి మహేష్, ఏజెంట్ పన్యాల రాజమౌళి గారికి తెలియపరచడమైనది. కావున ఇక నుండి ఏజెంట్ పన్యాల రాజమౌళి గారికి ఎలాంటి హక్కులు ఉండవని, ఇట్టి పత్రికా ప్రకటన ద్వారా తెల్పడమైనది. ఇట్టి విషయమై ఎలాంటి అభ్యంతరాలున్న 10 రోజులలోపు తెలుపగలరు.

ఇట్లు: **నాలం శశిధర్,** అడ్వకేట్
ఇంటి నెం. 10-6-216, కిసాన్‌నగర్, కరీంనగర్, జిల్లా: కరీంనగర్, పిన్: 505001,
సెల్: 9398129200

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, GUNTHA SANTOSH, R/o. 8-178/1, Gollapally, Jagityal, TS, have Changed My Name as GUNTHA SANTHOSH KUMAR, S/o. Jagannatham.
NT-311781

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

శివ కల్యాణానికి రాజన్న క్షేత్రం సిద్ధం

- రేపటి నుంచి ఐదురోజుల పాటు ఉత్సవాలు
- భక్తుల సమక్షంలోనే ఆదిదంపతుల వివాహం
- ఆలయ ఈవో కృష్ణప్రసాద్

వేములవాడ టౌన్, మార్చి 25: శివ కల్యాణ మహోత్సవాలకు వేములవాడ రాజన్న ఆలయం సిద్ధమైంది. బుధవారం నుంచి ఆదివారం వరకు ఐదు రోజుల పాటు వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. సోమవారం శివకల్యాణమహోత్సవాల ఏర్పాట్లపై ఆలయ అధికారులు, అర్చకులతో సమావేశమై చర్చించారు. గతంలో అద్దాల మండపంలో నిర్వహించిన ఆది దంపతుల వివాహ ఘట్టాన్ని ఈయేడు జగద్గురు శృంగేరి పీఠాధిపతుల ఉపదేశం మేరకు ఈ నెల 28న భక్తుల మధ్య నిర్వహిస్తామని వెల్లడించారు. ఉత్సవాల నేపథ్యంలో ఆలయ గోపురాల ను విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా అలంకరిస్తున్నామని అధికారులు తెలిపారు. భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

నేడు రాజన్న ఆలయ హుండీ లెక్కింపు

వేములవాడ టౌన్, మార్చి 25 : వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారి హుండీ లెక్కింపు నేడు మంగళవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ వెల్లడించారు. ఆలయ ఓపెన్‌స్లాబ్‌పై నిర్వహించే ఈ హుండీ లెక్కింపులో ఉదయం 8 గంటలకు ఆలయ ఉద్యోగులు విధిగా హాజరుకావాలని వారు సూచించారు.

వాహన తనిఖీలు

చందుర్తి, మార్చి 25: ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. చందుర్తి మండలం మూడపెల్లి వేంకటేశ్వర ఆలయం వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. సోమవారం వేములవాడ నుంచి రుద్రంగి వెళ్తున్న ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వాహనాన్ని, సెక్యూరిటీ వాహనాలను తనిఖీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చందుర్తి, మార్చి 25 : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరపరలో అంతరాయం నెలకొంటుందని సెస్ ఏఈ మహేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ రూరల్ మండలం పరిధిలోని మల్లారం 132/ 33 కేవీ సబ్‌స్టేషన్, 33కేవీ మర్రిగడ్డ లైన్ మరమ్మతులు ఉన్నందున మర్రిగడ్డ, తిమ్మాపూర్, సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మర్రిగడ్డ, తిమ్మాపూర్, మూడపల్లి, అనంతపల్లి అశిరెడ్డిపల్లి, జోగాపూర్, ఎన్గల్, రామన్నపేట, చందుర్తి, నర్సింగాపూర్ గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. 33కేవీ రుద్రంగి ఫీడర్ మరమ్మతులు ఉన్నందున మల్యాల, రుద్రంగి సబ్ స్టేషన్ పరిధిలోని మల్యాల, చెరువుకుంటపల్లి, రుద్రంగిల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, కావున వినియోగదారులు సహకరించాలని సెస్ ఏఈ మహేశ్ కోరారు.

రుద్రంగి : హోలీ సంబురాల్లో చిన్నారులు

సిరిసిల్ల పట్టణంలో హోలీ వేడుకల్లో మహిళలు

వేములవాడ పట్టణంలోని రాజన్న ఆలయం ఎదుట హోలీ వేడుకల్లో యువకులు

ఆనంద కేళీ.. హోలీ

జిల్లాలో అంబరాన్నంటిన రంగుల సంబురం

తెలంగాణ చౌక్/ సిరిసిల్ల టౌన్/ వేములవాడ/కోనరావుపేట/రుద్రంగి /చందుర్తి/వేములవాడరూరల్/ ముస్తాబాద్/ ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట/ సిరిసిల్ల రూరల్/వీర్నపల్లి, మార్చి 25: రంగుల హోలీ వేడుకలు యువతలో ఆనందాన్ని నింపాయి. జిల్లాలో సోమవారం హోలీ వేడుకలు అంబరాన్నంటాయి. జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నేతలు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ నివాసానికి వెళ్లి రంగులు చల్లి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఇక్కడ బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఇంటి ప్రాంగణంలో ట్రైనీ ఎస్పీ రాహుల్‌రెడ్డితో పాటుగా పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి ఒక్కరిపై ఒక్కరు రంగులు జల్లుకుంటూ సంతోషంగా గడిపారు. జిల్లా ప్రజలకు ఎస్పీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపా రు. వేములవాడ పట్టణంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వేడుకల్లో పాల్గొన్నారు. యువకులు పెద్ద సంఖ్య లో రాజన్న ఆలయం ఎదుట ఒకరికొకరు రంగులు చల్లుకొని వేడుకల్లో పా ల్గొన్నారు. చిన్నారులు, యువకులు, ప్రజాప్రతినిధులు రంగులతో హోలీ సంబురాల్లో ఉత్సాహంగా పాల్గొన్నా రు. తంగళ్లపల్లి మండలంలోని మండేపల్లి శివారులోని ప్రభుత్వ వయోజనుల వృద్ధుల ఆశ్రమంలో హోలీ వేడుకలను జరుపుకున్నారు. తాడూరులోని జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో హోలీ వేడుకల్లో ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు. పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి సంబురాలు చేసుకున్నారు. కార్మికులు, మహిళలతో కలిసి తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానస రాజు దంపతులు హోలీ వేడుకలు జరుపుకున్నారు. వీర్నపల్లి మండలం బావుసింగ్ నాయక్ తండాలో జడ్పీటీసీ గుగులోత్ కళావతి, మద్దిమల్ల తండాలో ఎంపీపీ మాలోత్ భూలా సంబురాల్లో పాల్గొన్నారు.

సిరిసిల్ల టౌన్: రంగులు పులుముకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ దంపతులు

సిరిసిల్ల రూరల్ : వేడుకల్లో తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానస రాజు

చందుర్తి : హోలీ సంబురాల్లో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

భార్య కాపురానికి రావడం లేదని..

- ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య
- కొలనూర్‌లో ఘటన

కోనరావుపేట, మార్చి 25 : ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని కొలనూర్ గ్రామంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ అంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నా యి. సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ గూడూరి సాగర్ (28), అదే కాలనీకి చెందిన అనూష అనే అమ్మాయిని ఐదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత అత్తవారి ఇంట్లోనే నివా సం ఉంటూ జీవనం సాగించాడు. అయితే, కొంత కాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు తలెత్తడంతో పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీలు జరిగాయి. ఇక సాగర్ తల్లిదండ్రు లు చంద్రకళ, బాబు కొద్ది రోజులుగా కోనరావుపేట మండలం కొలనూర్ గ్రామంలోని ఓ ఇంట్లో మహిళ బాగోగులు చూసుకునేందుకు జీతం ఉన్నారు. దీంతో రాజీవ్‌నగర్‌లోని తమ ఇల్లు ఖాళీగా ఉండడంతో కాపురం అక్కడికి మార్చుదామని సాగర్ అనుకున్నాడు. ఈ క్రమంలో అనూషను రావాలని కోరగా, ఆమె రాకపోవడంతో, ఆదివారం రాత్రి సమయంలో సాగర్ తన తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. వారంతా రాత్రి సమయంలో నిద్రలో ఉండగా సాగర్ చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్య చేసుకున్న తీరును పరిశీలించి వివరాలను సేకరించారు. అనంతరం మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఒకరి తర్వాత ఒకరు..ఏడాదిలో ఇద్దరు

- సంవత్సరం క్రితం కూతురు.. నేడు తల్లి మృతి
- బావుసాయిపేటలో విషాదం
- చందాలు పొగు చేసి అంత్యక్రియలు

వడ్నాల భారతి

కోనరావుపేట, మార్చి 25: నిల్వనీడ లేక కిరాయి ఇంట్లో బతుకు వెళ్లదీస్తున్న ఆ నిరుపేద కుటుంబాన్ని విధి వెంటాడుతున్నది. అనారోగ్యం వారి పాలిట శాపంగా మారింది. గతేడాది కిడ్నీ సంబంధ వ్యాధితో కూతురు మరణించగా ఆదివారం తల్లి హఠాన్మరణం చెందింది. వివరాలు.. మండలంలోని బావుసాయిపేటకు చెందిన వడ్నాల సతీశ్, భారతి దంపతులకు కూతురు శీరిష, కొడుకు సాయిగణేశ్. సతీశ్ క్షౌరవృత్తి చేస్తూ భారతి కూలీకి వెళ్తూ ఇద్దరు పిల్లలను చదివిస్తున్నారు. జీవితం ఉన్నంతలో హాయిగా సాగిపోతున్న తరుణంలో బిడ్డ శీరిష గతేడాది కిడ్నీ సంబంధ వ్యాధితో మరణించింది. బిడ్డ మరణంతో కలత చెందిన తండ్రి సతీశ్ కొన్ని రోజులకే పక్షవాతం బారినపడ్డారు. దవాఖానలో చికిత్స చేయించుకొని ప్రస్తుతం ఇంటివద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి భారతి నిద్రలోనే గుండెపోటుతో కన్నుమూసింది. ఆమె మరణంతో తండ్రీకొడుకులు కన్నీరుమున్నీరయ్యారు. కలోగంజో తాగుతూ బతుకుతున్న మాకు ఈ కష్టాలేంటని రోదించారు. అయితే భార్య అంత్యక్రియలకు చేతిలో చిల్లిగవ్వకూడా లేకపోవడంతో కుల సంఘం సభ్యులు, గ్రామస్తులు చందాలు పొగుచేసి దహనసంస్కారాలు చేశారు. నిరుపేద కుటుంబానికి దాతలు సాయం చేయాలని, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

రుద్రంగి అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

రుద్రంగి, మార్చి 25: మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రం (ఉత్తరా నక్షత్రం) పురస్కరించుకొని ఆలయంలో పూజ లు నిర్వహించారు. స్వామి వారిని ఆలయాన్ని మామిడి తోరణాలతో పూలతో సుందరంగా అలంకరించారు. శ్రీ అయ్యప్ప స్వామిని అభిషేకించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అయప్ప స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చంపుతామని బెదిరించిన ఇద్దరిపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 25: మండల కేంద్రానికి చెందిన గుండం జలపతిరెడ్డిని చంపుతామని బెదిరించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ బీ కిషన్‌రావు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం గుండారానికి చెందిన నర్సింలు, డేవిడ్ బీరు సీసాలతో జలపతిరెడ్డికి చెందిన సూపర్ మార్కెట్లోకి వచ్చి కోడిగుడ్లు కావాలని అడిగారు. కోడిగుడ్లు లేవని జలపతిరెడ్డి చెప్పగా ఇష్టారీతిన బూతులు తిడుతూ, బీరు సీసాలు చూపుతూ, అక్కడే ఉన్న పూలకుండీ ఎత్తి చంపుతామని బెదిరించినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు హౌస్ ఆఫీసర్ కిషన్‌రావు తెలిపారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

రుద్రంగి, మార్చి 25: మండల కేంద్రంలోని శ్రీ ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం, జాతర మహోత్సవాన్ని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకులు ఉదయం నుంచి పూజలు, హోమం వంటి కార్యక్రమాలు జరిపించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత, నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఇక్కడ తర్రె మనోహర్, బైరి గంగమల్లయ్య, చెలుకల తిరుపతి, ఎర్రం గంగనర్సయ్య, గంగాధర్, లింగం, గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెల మృతి

ముస్తాబాద్, మార్చి 25: మండల కేంద్రంలోని కావటి ఎల్లయ్యకు చెందిన గొర్రెల మందపై సోమవారం కుక్కలు దాడిచేయగా, ఎనిమిది మృతి చెందాయి. దీంతో సుమారు రూ.80 వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని ఎల్లయ్య విలపిస్తూ తెలిపారు.

లింగంపేట బుద్ధ విహార్ అభివృద్ధికి కృషి

భూమి పూజ చేసున్న చైర్మన్ దప్పుల అశోక్

చందుర్తి, మా ర్చి 25: చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో గుట్ట పైన ఏర్పా టు చేసిన బుద్ధ విహార్ అభివృద్ధికి కృషి చేస్తామని చార్వాక ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, బుద్ధ విహార్ అభివృద్ధి కమిటీ నాయకుడు దప్పుల అశోక్ అన్నారు. చందుర్తి మండలం లింగంపేటలో సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. గుట్టపైకి ఎక్కేందుకు వీలయ్యే నాలుగు ముఖ్యమైన పనులకు భూమి పూజ చేశారు. దాతల సహకారంతో పనులను పూర్తి చేయాలని నిర్ణయించారు. అనంతరం బుద్ధ విహార్ అభివృద్ధి కమిటీని కూడా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దప్పుల అశోక్, ఉపాధ్యక్షులుగా దయ్యాల కమలాకర్, కోశాధికారిగా డికొండ విజయ్ కుమార్, సలహాదారులుగాఉచ్చిది రాజిరెడ్డి, చీటి విద్యాసాగర్ రావు, కోమటిరెడ్డి. వెంకటరెడ్డి, బర్క గోపాల్, వర్కింగ్ మెంబర్స్‌గా ఇందూరి రాములు, ఎన్నం లింగయ్య, మ్యాకల మునీందర్‌ను ఎన్నుకున్నారు. మెట్ల నిర్మాణం కోసం ఉపాసకులు కొమ్ము రమేశ్ చేతుల మీదుగా భూమి పూజ చేశారు, ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున బౌద్ధ విహార సభ్యులు ఉన్నారు.

'నమస్తే' బ్యూరోకు పరామర్శ

బ్యూరో ఇన్‌చార్జి ప్రకాశ్‌రావును పరామర్శిస్తున్న నమస్తే తెలంగాణ ఎడిటర్ కృష్ణమూర్తి, తెలంగాణ టుడే ఎడిటర్ శ్రీనివాస్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్/ బోయినపల్లి, మార్చి 25 : నమస్తే తెలంగాణ దిన పత్రిక కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి కడపత్రి ప్రకాశ్‌రావు తల్లి సావిత్రిబాయి ఆదివారం సాయం త్రం అనారోగ్యంతో మరణించింది. సోమవారం వారి స్వగ్రామమైన తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామ పరిధిలోని నైనివారిపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఉదయం ప్రకాశ్‌రావు, ఆయన కుటుంబ సభ్యులను నమస్తే తెలంగాణ ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి, తెలంగాణ టుడే ఎడిటర్ శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆపరేషన్స్ జీఎం సీహెచ్ శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చల్మెడ లక్ష్మీనర్సింహారావు, ఏనుగు మనోహర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, పలువురు నాయకులు, అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పరామర్శించారు.

రామాలయంలో డోలోత్సవం

రామాలయంలో స్వామి వారికి డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

గంభీరావుపేట, మార్చి 25: మండల కేంద్రంలోని శ్రీ సీతారామ స్వామి ఆలయంలో సోమవారం డోలోత్సవం నిర్వహించారు. హోలీ పర్వదినం పురస్కరించుకుని స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల భజనల మధ్య అర్చకులు స్వామి వార్లకు డోలోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ వేంకటేశ్వర స్వామి రథోత్సవం

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, గ్రామస్తులు

చందుర్తి, మార్చి 25: చందుర్తి మండలం బండపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి అధ్యయన బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పుర వీధుల గుండా రథయాత్ర నిర్వహించగా భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. వేంకటేశ్వర స్వామి గోవిందా గోవిందా అంటూ నామస్మరణం చేస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. ఇక్కడ ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం లక్ష్మిరెడ్డి, మాజీ సర్పంచ్ గడ్డం పద్మాతిరుపతి రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు లింగంపల్లి బాబు, మల్యాల గంగనర్సయ్య, కొండ లక్ష్మణ్ గౌడ్, ఏనుగుల లచ్చిరెడ్డి, బుర్ర వెంకట్ గౌడ్, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, గంప పవన్, అంబాల శ్రీకాంత్, కాసారపు గంగాధర్, గ్రామస్తులు ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపీపీ మానస

సిరిసిల్ల రూరల్, మార్చి 25: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని చక్రాల శ్రీకాంత్ నివాసంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు లేచి, గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఎలక్ట్రానిక్ వస్తువులతోపాటు నగదు, ఆభరణాలు కాలిపోయాయి. పోలీసులు చేరుకుని, వివరాలు సేకరించారు. ఎంపీపీ పడిగెల మానస, పడిగెల రాజు దంపతులు వారి నివాసానికి వెళ్లి ప్రమాదాన్ని పరిశీలించారు. రూ.3 వేలు ఆర్థిక సహాయం అందజేసి, భరోసానిచ్చారు.

లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణ వేడుక

ఇల్లంతకుంట, మార్చి 25 : మండలంలోని ముస్కానిపేట గ్రామంలోని లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ వేడుక సోమవారం ఘనంగా జరిగింది. మూడు రోజులుగా జాతరోత్సవాలు జరుగుతున్నారు. సాయంత్రం రథోత్సవం నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అక్కపల్లిలో అంధకారం

- ఆరు గంటల పాటు నిలిచిన కరెంట్ సరఫరా
- ఇబ్బందిపడ్డ గ్రామస్తులు
- అధికారుల తీరుపై ఆగ్రహం

అక్కపల్లిలో కరెంటు లేక బైక్ లైట్ల వెలుతురులో కరెంటు కోసం నిరీక్షిస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 25: మండలంలోని అక్కపల్లిలో అంధకారం అలుముకున్నది. సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 8వరకు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. ఎండకాలం కావడంతో ఉక్కపోతను భరించలేక ఆరుబయట ఉండిపోయారు. కరెంట్ నిలిచిపోవడంపై సెస్ ఏఈ పృథ్వీ స్పందనగా కోరగా అక్కపల్లి సబ్‌స్టేషన్‌పీటీఆర్‌లోనే సమస్య ఉన్నదని తెలిపారు. నిపుణుల సమక్షంలో మరమ్మతు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కాగా, ఇన్నాళ్లు ఒక్క గంట కూడా కరెంట్ పోలేదని, ఇప్పుడు మళ్లీ కరెంట్ కోతలు మొదలయ్యాయని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు.